

# మా మాట



**పాఠకులకు, ప్రకటన కర్తలకు హనుమజ్జయంతి శుభాకాంక్షలు.**

ధ్యానమూలం గురోః మూర్తిః పూజా మూలం గురోః పదం ।
మంత్ర మూలం గురోః వాక్యం, ముక్తి మూలం గురోః కృపా ॥

గురురూపమే ధ్యానమునకు మూలం, గురుపాదాలు పూజకు మూలం, గురునామమే మంత్రం, గురువాక్యమే ముక్తికి మార్గం. సర్వం గురుమయమే "సాయి" అంటే విశ్వచైతన్యం. "ఎవరి దృష్టి నాయందు కలదో వారియందే నాకటాక్షము కలదు" అన్నారు సాయి. "సాయి అంటే ఐదున్నర అడుగుల మనిషి శిరిడీలోనే ఉన్నాడు అని అనుకునేవాడు నన్నసలు చూడనట్లే. నీవు చూసేదంతా కలసినేను" అన్నారు శ్రీ శిరిడీసాయి. మన కంటిఎదుట కనిపించే సకల చరాచర దృశ్యమానము సాయి స్వరూపమే. సకల దేవతా, సాధు, జీవ, జడ స్వరూపినని ప్రత్యక్ష నిరూపణ చేసిన జగద్గురువు శ్రీసాయి. ధ్యానము అంటే సద్భావనా ప్రవాహము, సంతతధారగా నిరంతరం గురువుపై మనస్సు నిల్పటము. చైతన్య స్వరూపుడయిన సాయి, మనకోసం ఐదున్నర అడుగుల రూపంలో నిరంతరం ధ్యానానికి ఆధారముగా నిలిచారు.

"ఎదుటనున్న నారూపాన్ని నఖశిఖపర్యంతం చూస్తూ ఉండు. దానివలన చూసేనీవు, చూడబడే వస్తువు, చూసే క్రియ లయమై బ్రహ్మసమరసత కలుగుతుంది" అన్నారు సాయి. బాబా తన గురు సేవావృత్తాంతములో "నా యావశక్తిని కళ్ళలో నింపుకొని, నిరంతరము నా గురువుపై దృష్టి నిలపి ఏకాగ్రముగా ధ్యానించాను. అట్లా నిరంతరము నాగురువును చూస్తున్నప్పుడు పొరపాటున నా కనురెప్పలు మూతపడితే, నా గురువుపైగల నిరంతర దృష్టికి అవరోధమైన కనురెప్పలు పీకివేస్తే బాగుండునేమోనని అనిపించింది" అంటారు. అంతేకాక "నా గురువుకోసం సమీపగ్రామాలకు వెళ్ళి భిక్ష స్వీకరించి, నా గురువు నోటికి అందించి, ఆయన మలమూత్రాలు విసర్జిస్తే శుభ్రంచేస్తూ నిరంతరం గురుసేవలో మునిగేను" అని అంటారు సాయి. భిక్షకి వెళ్ళినప్పుడు, ఇతరసేవలు పరోక్షముగా జరిగినప్పుడు మరి సాయి దృష్టి దేనిమీద నిలిచింది? తరచిచూస్తే చూపుబాహ్యమైనా, దృష్టినిలపాల్సింది ఆంతర్యములో, అందుకే ఎక్కడ ఉన్నా, ఏమిచేస్తున్నా, ఏమి మాట్లాడుతున్నా గురువు ప్రత్యక్ష సన్నిధిలో మనము జీవిస్తున్నామని ఎరుకగలిగి ఉండడం ప్రధానం. హేమాద్రిపంత్‌తో సాయి "నాకు పెట్టకుండా ఎప్పుడు ఏమీ తినను అని అన్నావుకదా! శిరిడీవచ్చినప్పుడు సరే, మరి నీ ఊళ్ళో, నీఇంట్లో ఉన్నప్పుడు, ఆహారము తీసుకునేటప్పుడు నాకు అర్పిస్తున్నావా, నేను ఇక్కడే గాని అక్కడలేనా" అని ప్రశ్నించి, తన సర్వవ్యాపకత్వాన్ని తెలియజేశారు. దృష్టి నిలపమంటే సర్వత్రా నిండిన చైతన్యస్వరూపుడయిన సాయిని గుర్తెరిగి వారి సన్నిధిలో, సాంగత్యముతో జీవిస్తున్నామని ఎరుకగలిగి ఉండటము. అట్లాంటి ఎరుక కలిగి, ఆరకంగా జీవించి, తన జీవితం, తన జన్మ సార్థకత చేసుకోవటానికే కాకుండా లక్షలాది మందికి ఆదర్శముగా నిలచి, సాయి అనుంగు బిడ్డడై, సాయిమాస్టర్‌గా ప్రసిద్ధికెక్కి, నేటికి సమాధిచెంది 21 సంవత్సరాలు గడచినా, నేటికీ నిత్యసత్యులై ఉన్నతమైన సాయిమార్గంలో పయనింపచేస్తున్న ఆచార్య ఎక్కిరాల భరద్వాజగారు మనము ఆస్థితి పొందటానికి చెక్కవంతెనగా తాను నిలిచి, ఆమార్గంలో పయనం చేయటానికి "క్షణ క్షణమూ ఆత్మవికాసముతో జీవించటం ఒక్కటే మన జీవిత లక్ష్యం కావాలి" అని బోధించారు. అట్లా జీవించటానికి నిరంతరం ప్రయత్నం చేయటమే సద్గురువుపై దృష్టి నిలపటం.

మీ అందరి ఆదరాభిమానాలతో ఆధ్యాత్మిక త్రైమాసపత్రికలలో ఒక ఉన్నతమైన స్థానాన్ని సంపాదించుకున్న శ్రీ భరద్వాజ సద్గురువాణి 10వ సంవత్సరములోకి అడుగిడి ముందుకు సాగుతున్నది. 10సంవత్సరాల క్రితం నిర్ణయించబడిన పత్రిక సభ్యత్వ రుసుములే నేటికీ కొనసాగిస్తున్నాము. ముద్రణా, రవాణా, మొదలైన అనేక విషయాలలో వ్యయము ఎంతో పెరిగినా రాజీలేని దృక్పథంతో పత్రిక అందించాలనే మాఆకాంక్ష. దీనికి సహకారిగా ప్రకటన రూపేణ, వ్యాపారవేత్తలు స్వచ్ఛందముగా సహకరించటమే కాకుండా పాఠకుల ఆదరాభిమానాలతో, లాభాపేక్ష లేని సేవా భావంతో పత్రిక నడుపగలుగుతున్నాము. కనీసం ఒక శతాబ్దము పాటు అయినా అట్లా కొనసాగించాలని మా ఉద్దేశ్యము. దీనికి నిదర్శముగానే మా అభీష్టాలను పక్కనబెట్టి ఈ సంచికను కూడ ఎక్కువ పేజీలతో ప్రత్యేక సంచికగా రూపొందించటం జరిగింది. ఆంధ్రదేశములో నిర్దుష్టమైన సాయి సంప్రదాయాన్ని అందించిన పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజగారి పేరిట ఈప్రత్యేక సంచికను రూపొందించటం జరిగింది.

శ్రీ భరద్వాజ సద్గురువాణి మీ హృదయవాణిగా తీర్చిదిద్దటానికి నిరంతరం మేము శ్రమిస్తామని, దానికి మీ ఆదరాభిమానాలు తోడై దినదిన ప్రవర్ధమానమవ్వాలని కోరుకుంటూ..



శుభాకాంక్షలతో

**మీ పబ్లిషర్**